ప్రజాశక్తి
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 5 అనంతపురం





జెడిఎకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, రైతుసంఘం నాయకులు

పారదర్శకంగా యూరియా పంపిణీ చేయండి

జెడికి రైతుసంఘం, సిఐటియు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆయా గ్రామాల్లో రైతులకు పారదర్శంగా యూరియా పంపిణీ చేయాలని రైతుసంఘం, సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం హెచ్ఎల్సి కాలువకు నీరు రావడంతో రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇదే సమయంలో అవసరమైన ఎరువులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇలా సమయంలో అధికారులు యూరియా పంపిణీలో పారదర్శకత పాటించాలన్నారు. ఆయా గ్రామాల్లో చాటింపు వేసి రాజకీయ జోక్యం లేకుండా యూరియా పంపిణీ చేసే చర్యలు చేపట్టాలని కోరారు. ఆధార్ కార్డుకు రెండు బస్తాలు మాత్రమే ఇచ్చే విధానం రద్దు చేసి రైతుకు అవసరమైన యూరియా, ఎరువులు పురుగుమందులు, విత్తనాలు రైతు సేవా కేంద్రాల ద్వారా ఇవ్వాలని కోరారు. యూరియా అక్రమంగా నిల్వ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఖరీఫ్‌లో యూరియా అమ్మకాలు జరిగిన దానిపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



టవర్ క్లాక్ వద్ద నిరసన వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెడికల్ కళాశాలలను

ప్రయివేటీకరణ చేస్తే ఉద్యమిస్తాం

- వైద్య విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేటు పరం చేసే కుట్రలు చేస్తోందని, ఇదే జరిగితే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ హెచ్చరించారు. మెడికల్ కళాశాలలకు పిపిపి విధానం అమలు చేస్తూ రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులతో కలిసి గురువారం నాడు అనంతపురం టవర్‌క్లాక్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, జిల్లా అధ్యక్షుడు గిరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తాము మెడికల్ కళాశాలల నిర్మాణం చేయలేమంటూ నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాయడం అన్యాయంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి మూడు నెలల కాలంలోనే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో పది మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ చేయడం కోసం తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో పేద, మధ్యతరగతి, వెనకబడిన వర్గాల విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయడమే అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు నీట్ కోసం సన్నద్ధం అవుతున్న సమయంలో ప్రభుత్వం ప్రయివేటీకరణ నిర్ణయం చేయడం దుర్మార్గం ఉందన్నారు. నీట్‌కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించకుండా రాష్ట్రంలో ఉన్న మెడికల్ కళాశాలను ప్రయివేటీకరణ చేసే తీర్మానాలు చేయడం దుర్మార్గం ఉందన్నారు. వైద్యశాఖ మంత్రి సత్య కుమార్ కేంద్రంతో మాట్లాడి రాష్ట్రంలో నీట్ సంపూర్ణంగా వ్యతిరేకించాలన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకించి మెడికల్ ఇంట్రన్స్ టెస్ట్ నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి శివ, నాగభూషణ్, సోము, విజయ్, జయ, శశి కుమార్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు బదిలీ

- అనంతపురం కలెక్టర్‌గా ఒ.ఆనంద్
- సత్యసాయి కలెక్టర్‌గా శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాల కలెక్టర్లు ఇద్దరూ బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం నాడు 12 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్లు ఉన్నారు.

అనంతకు ఆనంద్- బాపట్లకు వినోద్ కుమార్

అనంతపురం జిల్లా కలెక్టర్ డా॥వి.వినోద్‌కమార్ బాపట్ల జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లురు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఒ.ఆనంద్‌ను నియమించారు. డా॥వినోద్‌కుమార్ 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో అనంతపురం కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లు బదిలీ అయినప్పటికీ వినోద్‌కుమార్‌ను మార్చలేదు. ఆయనే కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు ఆయన్ను బాపట్ల కలెక్లర్‌గా నియమించారు. ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఒ.ఆనంద్ అనంతకు వచ్చారు. ఈయన 2016 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. ఆయన్ను 2024 జులై నెలలో అక్కడి కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. తాజా బదిలీల్లో ఆయన్ను అనంతపురం కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా శ్యామ్ ప్రసాద్

సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా ఉన్న టిఎస్.చేతన్ బదిలీ అయ్యారు. కాగా ఈయనకు తాజా పోస్టింగ్ ఎక్కడన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. 2024 ఎన్నికల అనంతరం ఈయన సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా ఉన్న శ్యామ్ ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. శ్యామ్ ప్రసాద్ కూడా గతేడాది జులై నెలలోనే పార్వతీపురం మన్యం కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన్ను ఇప్పుడు సత్యసాయి జిల్లాకు నియమించింది. ఈయన కూడా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ ఆఫీసర్. ఇద్దరు కలెక్టర్లు ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.



అనంత కలెక్టర్ ఆనంద్



శ్రీ సత్యసాయి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం పట్టణంలోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఎపిటిఎఫ్ వారం రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సిపిఎస్ రద్దు, పిఆర్‌సి కమిటీ నియామకం, డిఎ బకాయిలు, మధ్యంతర భృతి విడుదల, హెల్త్ కార్డ్ పరిమితి పెంపు, అసెస్మెంట్ బుక్ లెట్ విధానం రద్దు, తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గత పాలనలో దారిమళ్లిన సబ్‌ప్లాన్ నిధులు

డా॥ఉండవల్లి శ్రీదేవి



విలేకరులతో మాట్లాడుతున్న డా॥శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2019 నుంచి 2024 మధ్యకాలంలో నవరత్నాల పేరుతో సబ్ ప్లాన్ నిధులన్నింటినీ దారిమళ్లించి ఎస్సీల అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం మరిచిందని ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్ డా॥ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. అనంతపురం జిల్లా షెడ్యూల్డు కులాల సేవ సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుల కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. పాతవాటి పునరుద్ధరణ కోసం అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చిన నిధులను మూడు ముక్కలాట చేసి పక్కదోవ పట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల మన్ననలు పొందాయన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే రాష్ట్రానికి పదిన్నర లక్షల కోట్ల విలువైన పరిశ్రమల పెట్టుబడులు వచ్చాయంటే అది చంద్రబాబు పాలనా దక్షతకు నిదర్శనం అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మహిళల ఉన్నతి పథకం కింద ఐదు లక్షల రూపాయల లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, పాల్గొన్నారు.

రైతులకు తప్పని 'యూరియా' తిప్పలు..!

బస్తాపై అదనంగా రూ. 62 వసూలు.. ఆగని అక్రమ తరలింపు..



కోరమండల్ దగ్గర క్యూ కట్టిన రైతులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని 13 కేంద్రాలకు 172 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి నిర్మల్‌కుమార్ తెలిపారు. బొమ్మనహాల్, హొన్నూరు, బొల్లనగుడ్డం, గోవిందవాడ, బండూరు, సిద్ధరాంపురం, ఉంతకల్లు, లింగదహాల్, శ్రీధరఘట్ట, గోనెహాల్, ఉద్దేహాల్ కేంద్రాలతో పాటు కోరమాండల్ ప్రైవేట్ వ్యవసాయ రైతు సేవా కేంద్రాలకు 12.5 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా వచ్చింది. రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ధారించింది. బస్తా రూ. 268 కాగా అధికారులు రూ. 330 చొప్పున అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతుల నుంచి బస్తాకు రూ. 62 అదనంగా వసూలు చేస్తున్నారు. అలాగే వచ్చిన యూరియాలో ప్రతి కేంద్రం నుంచి 80 బస్తాలను ప్రజాప్రతినిధులకు అక్రమంగా తరలించారని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా కోసం రైతులు వేకువజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ క్యూ లైన్‌లో వేచిఉన్నా అందే పరిస్థితి లేదు. ఇక కౌలు రైతులకు అయితే ఏమాత్రం యూరియా పంపిణీ చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకుని రైతులకు సక్రమంగా యూరియా పంపిణి చేయాలని రైతులు కోరుతున్నారు. వీటిని ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి నిర్మల్ కుమార్ వద్ద ప్రస్తావించగా అలాంటివేనీ తన దృష్టికి రాలేదని సమాధానం దాటవేశారు.

దుర్గం రెవెన్యూ డివిజన్‌లో వర్షం

కణేకల్లులో 94 మి.మీ వర్షపాతం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. అందులో అత్యధికంగా కణేకల్లులో 94 మి.మీ, కళ్యాణదుర్గంలో 50.2, డి.హీరేహాల్‌లో 37.2, బొమ్మనహాల్‌లో 27.2, బ్రహ్మసముద్రంలో 20, రాయదుర్గంలో 16.2, శెట్టూరులో 9.4, కంబదూరులో 7.4, గుమ్మఘట్టలో 4.8, బెళుగుప్ప, కుందుర్పి మండలాల్లో 3.2మి.మీ వర్షపాతం నమోదైనట్లు కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ అధికారులు ఓ నివేదికలో పేర్కొన్నారు. కొన్ని మండలాల్లో ఆశాజనకంగా వర్షం కురవడంతో ఖరీఫ్ పంటలకు మేలు జరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. మరికొన్ని మండలాల్లో ఏమాత్రం ఆశాజనకంగా వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పు రావడంతో వర్షాలు కురుస్తాయనే ఆశాభావంలో వున్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని 33 గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకూ వర్షం కురిసింది. దీంతో మండలంలో 27.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహశీల్దార్ మునివేలు తెలిపారు. ఈ వర్షంతో వరి నాట్లు, వేరుశనగ, పత్తి, మిరప, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులకు ఉపశమనం కలిగింది. అలాగే వేదవతి-బండూరు వంక, హరేసముద్రం, శ్రీధరఘట్ట వంకలో నీరు ప్రవాహం ఎక్కువ కావడంతో ఆ మార్గంలోని కొన్ని గ్రామాలకు సుమారు రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.



బొమ్మనహాల్‌లో భారీ వర్షానికి పరుగులు తీస్తున్న వేదవతి నది

మోతాదుకు మించి యూరియా వాడితే అనర్థం


ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్



మాట్లాడుతున్న సంచాలకులు పద్మలత

మోతాదుకు మించి యూరియా వాడరాదని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పథకం సంచాలకులు పద్మలత రైతులకు సూచించారు. యూరియా అధికంగా వాడడం వల్ల కలిగే దుష్ప్రభా వాలు, సిఫారసు మేరకు వాడే విధానాలు, మేలైన వ్యవసాయ పద్ధతులపై గురువారం మండలంలోని ఆవులదట్ల, రేకులకుంట గ్రామాల్లో రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతపురం వ్యవసాయ అధికారి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు లక్ష్మీనరసింహులు, రుమానా బేగం మాట్లాడుతూ సిఫారసు మేరకు మాత్రమే యూరియా వాడాలని, అధికంగా వాడడం వల్ల చీడపీడల ఉధృతి పెరుగుతుందన్నారు. నేల భౌతిక రసాయనిక లక్షణాలు పాడవుతామని, కాండం పెలుసుగా మారి గాలికి పంట పడిపోతుందని వివరించారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం మండల వ్యవసాయ అధికారి అహ్మద్‌బాషా, రైతు సేవా సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

'రిడ్స్' ఆధ్వర్యంలో వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రిడ్స్ మహేష్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రిడ్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మోడల్ స్కూల్‌లో హెచ్ఐవి/ఎయిడ్స్, టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవి/ఎయిడ్స్ సంక్రమణ, నియంత్రణ, జాగ్రత్తలు, నివారణ మందులు, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి వివరించారు. హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్న చూపు తగదన్నారు. చెడు వ్యసనాలు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. రిడ్స్ పియు-2 ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, ప్రిన్సిపల్ పద్మజదేవి, కిరణ్ కుమార్, ఎఎన్ఎం వరలక్ష్మి, రీడ్స్ సిబ్బంది, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కూటమి సభ విజయవంతంపై ప్రజానీకానికి ధన్యవాదాలు : ఎమ్మెల్యే


ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు

అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభకు తరలివచ్చిన నియోజకవర్గ కూటమి శ్రేణులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ప్రజావేదిక లో గురువారం ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంత జీవనాడి బిటిపి, హంద్రీనీవా ప్రాజెక్ట్‌లో భాగంగా ప్యాకేజీ ఏ, బీ ద్వారా నియోజకవర్గానికి నీళ్లు తీసుకొచ్చేందుకు ఈ ఏడాది కృషి చేస్తామని హామీ ఇచ్చిన సిఎం చంద్రబాబు, పంచాయతీ రహదారులు 2వేల కిలోమీటర్లకు పైగా అవసరం ఉందని చెప్పగానే స్పందించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని తిరిగి తీసుకొచ్చేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విజయవాడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకుని, తెలుగు ప్రజలను స్వదేశానికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ లక్ష్మీదేవి రమేష్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, మోరేపల్లి మల్లికార్జున, నాయకులు శర్మాస్, గోళ్ల వెంకటేశులు, డికె.రామాంజనే యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివేకానందుని స్ఫూర్తితో లక్ష్యం సాధించాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో శారదా దేవి ట్రస్ట్ నిర్వాహకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యార్థులు వివేకానందుని స్ఫూర్తితో లక్ష్యం సాధించాలని శారదాదేవి జ్ఞాన నిధి ట్రస్ట్ నిర్వాహ కులు అర్చనానంద సూచించారు. అలాగే వివేకానందుని చికాగో ఉపన్యాసాలను వినిపించారు. స్వామి వివేకానంద చికాగో ఉపన్యాసాల 133వ దినోత్సవం సందర్భంగా గురువారం ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రస్ట్ తరపున బీ.టెక్, ఎంబీబీఎస్, బీ.ఫార్మసీ, తదితర ఉన్నత విద్యనభ్యసిస్తున్న నియోజకవర్గానికి చెందిన 28 మంది ప్రతిభగల నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులకు రూ. 2.2 లక్షల విలువ చేసే వివేకానంద ప్రతిభా పురస్కారాల చెక్కులను అంద జేశారు. ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో చాలా ఏళ్లుగా నియోజకవర్గ పరిధిలో ప్రతిభగల నిరుపేద విద్యార్థులకు వివేకానంద ప్రతిభా పురస్కారాలు, ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉపకార వేతనం డబ్బులను విద్యార్థుల విద్యాభ్యాసానికి ఉపయోగించాలని తల్లిదండ్రులకు సూచించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వీరేష్, బళ్లారి పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు హనుమంతు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో స్ఫూర్తి కలిగేలా ఉపన్యసించారు. సమాజ సేవకులు ముగ్గురికి ప్రోత్సాహక కానుకలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు, సభ్యులు, విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజలు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధికార ప్రతినిధిగా ప్రియాంక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్



బేబి ప్రియాంక

వైసిపి జిల్లా అధికార ప్రతినిధిగా నామాల బేబీ ప్రియాంకను ఆ పార్టీ అధిష్టానం నియమిం చింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. ప్రియాంక మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ అవకాశం ఇచ్చిన పార్టీ అధినేతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

బివి.వెంకటరాముడుకు పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బివి.వెంకటరాముడు పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం మాసినేని గ్రాండ్స్‌లో కూటమి పార్టీల నేతల సమక్షంలో కేక్ కట్ చేశారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు బికె.పార్థసారధి, అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెస్.రాజు, బండారు శ్రావణి శ్రీ, ఉమ్మడి టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, అంజనప్ప, జనసేన రాష్ట్ర నాయకుడు పత్తి చంద్రశేఖర్ తదితరులు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి అభివృద్ధికి బివి.వెంకటరాముడు చేసిన కృషిని నాయకులు కొనియాడారు. టిడిపి జిల్లా కార్యాలయంలో కూడా నాయకులు, కార్యకర్తలు బివికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



బివి వెంకటరాముడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టిడిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, కూటమి నాయకులు

క్వాంటమ్ టెక్నాలజీతో అద్భుతమైన ఫలితాలు

జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

క్వాంటమ్ టెక్నాలజీ అనేది భవిష్యత్‌లో చాలా అద్భుతమైన ఫలితాలను ఇస్తుందని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. గురువారం అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్ -2025 సెమీఫైనల్ పోటీలను ఘనంగా నిర్వహించారు. పోటీలలో ఉమ్మడి కర్నూలు, అనంతపురంలోని వివిధ డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయ కళాశాలల నుంచి రెండు జట్లు చొప్పున పాల్గొన్నాయి. మొత్తం పది విభాగాలకు సంబంధించిన క్వాంటం టెక్నిక్స్, అల్గారిథమ్స్ ప్రజెంట్ చేశారు. ఢిల్లీ ఐన్నినిటీ ఎఐ, లండన్ సీఈఓ బి.రామకృష్ణ, అటల్ ఇంకుబేషన్ సెంటర్ ఎసిఈఓ నుంచి సి.చంద్రమౌళి, గణిత ఆచార్యులు ఇ.కేశవరెడ్డి, ఫిజిక్స్ ఆచార్యులు పి.పద్మ సువర్ణ, కంప్యూటర్ సైన్సు ఆచార్యులు ఎపి శివకుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎవివి సత్యనారాయణ, ఎస్.కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, కన్వీనర్ సి.శోభాబిందు, కోఆర్డినేటర్లు కె.మాధవి, ఆర్.రాజశేఖర్, ఎపి శివకుమార్, సీనియర్ ఆచార్యులు ఎ.ఆనందరావు, బి.ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-శింగనమల

మండలంలో ఎక్కడైనా ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండల వ్యాప్తంగా దుకాణాలు, హోటళ్లలో ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించకూడదన్నారు. ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్లాస్టిక్ వాడటం తగ్గించాలన్నారు. దీనికోసం మండలంలోని, గ్రామాల్లో ఎక్కడ చూసినా ప్రదేశంలో ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయన్నారు. వాటిని నియంత్రించకపోతే మానవజాతికి మనుగడ ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ఇకనుంచి మండలంలో ఎక్కడైనా హోటళ్లు, టీస్టాళ్లు, దుకాణాల వద్ద ప్లాస్టిక్ గ్లాసులు వాడినా, ప్లాస్టిక్ కవర్లు ఎక్కడపడితే వేసినా కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. హోటళ్లు, టీస్టాళ్లు, దుకాణాల నిర్వాహకులు ప్రత్యేకంగా బుట్టలు ఏర్పాటు చేసుకుని వ్యర్థాలను అందులో వేసుకుని పంచాయతీ కార్మికులకు అందజేయాలన్నారు. అలాగే కూరగాయలు, నిత్యావసర సరుకులు తీసుకునేటప్పుడు కూడా ప్లాస్టిక్ కవర్లను ఎక్కువగా వాడుతున్నారన్నారు. ప్రజలు కూరగాయలు కొనేటప్పుడు దుకాణాలకు ఇకనుంచి వెళ్లేటప్పుడు బ్యాగు చేత పట్టుకుని వెళ్లాలని సూచించారు. ప్లాస్టిక్‌తో తయారయ్యే బ్యాగులు, గ్లాసులు, కవర్లు వాడకూడదన్నారు. ఎవరైనా దుకాణదారులు ప్లాస్టిక్, కవర్లు, గ్లాసులు, ప్లాస్టిక్ వస్తువులు అమ్మినట్లయితే సంబంధిత దుకాణాలు, టీస్టాళ్లను సీజ్ చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.


ఎంపిడిఒ భాస్కర్

అరటిలో తెగుళ్ల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

అరటిసాగులో సిగటోగ ఆకుమచ్చ తెగులుపై రేకులకుంట వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త మాధవి అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని ముచ్చుకోట గ్రామంలో ఉద్యాన శాఖ అధికారిణి ఉమాదేవి ఆధ్వర్యంలో అరటి పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరటి పంటకు సిగటోక ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశం అధికంగా ఉన్న నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ తెగులు వస్తే ఆకులపై మొదట సమాంతర చిన్న చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ పెరిగి పెద్దవై బూడిద రంగులోకి మారుతాయన్నారు. ఈ మచ్చలు గోధుమ రంగులోకి మారి పరిమాణంలో పెద్దవై ఒకదానితో ఒకటి కలిసిపోతాయన్నారు. తెగులు ఉధృతి పెరిగినప్పుడు మచ్చలు కలిసిపోయి ఆకులు మొత్తం ఎండిపోతాయన్నారు. కావున తోటలో కలుపు లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. నీటి పారుదల వ్యవస్థను మెరుగు పర్చుకుని తోటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే సూచించిన మందులను పిచికారి చేసుకోవాలన్నారు. తెగుల మందులను గెలలు కోయడానికి 45 రోజుల ముందుగా మాత్రమే పిచికారి చేయాలన్నారు. లేకుంటే కాయల్లో మందుల విశేషాలు మిగిలిపోయే ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చుకోట గ్రామ రైతులు, ముచ్చుకోట రైతు సేవా కేంద్రం అధికారి పెర్సీ, ఎంపిఇఒ మునేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

సాంకేతికతతో మానవ తప్పిదాలకు చెక్

ఎస్‌వి కళాశాల వైస్‌చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి


ప్రజాశక్తి-అనంతపురం

మన చుట్టూ ఉన్న పరికరాలను ఇంటర్నెట్‌కు కనెక్ట్ చేసి డేటాను పంపడం ద్వారా శ్రమ, మానవ తప్పిదాలను తగ్గించవచ్చని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల వైస్‌చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలోని ఎలక్ట్రానిక్ విభాగం ఆధ్వర్యంలో కర్ణాటకకు చెందిన ఆర్ లాజిక్ టెక్నాలజీస్ సహకారంతో మూడురోజుల ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వర్క్‌షాప్ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెన్సార్లు, యాక్చుయేటర్లు, మైక్రోకంట్రోలర్లు, కమ్యూనికేషన్ మాడ్యూల్స్, క్లౌడ్ ప్లాట్‌ఫామ్ వంటి ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్‌ని కలిపి స్మార్ట్ సిస్టమ్స్‌ను ఉపయోగించి వాతావరణంలోని ఉష్ణోగ్రత, తేమ, కాంతి,పరికరాలను ఆటోమేటిక్‌గా ఆన్/ఆఫ్ చేయడం, అలర్ట్‌లు పంపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ లాజిక్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు బి.హెచ్ ప్రసాద్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పరికరాలు, స్మార్ట్ అప్లికేషన్లు, రియల్-టైమ్ అప్లికేషన్ల కోసం ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ స్కిల్స్,క్లౌడ్ ప్లాట్‌ఫామ్ వినియోగం, ఎలక్ట్రానిక్ కంపోనెంట్స్ (సెన్సర్లు, యాక్చుయేటర్లు, మైక్రోకంట్రోలర్లు) వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్, ఏవో శ్రీనాథ్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కె.జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం


మాట్లాడుతున్న దాసరి సునీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి సలహామండలి కమిటీ ఛైర్‌పర్సన్ దాసరి సునీత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. ముఖ్యంగా రోగులకు సౌకర్యాలతోపాటు మెరుగైన చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వైద్యాధికారిణి స్వాతిలక్ష్మి, రెవెన్యూ ఆఫీసర్ శ్రీధర్‌మూర్తి, మండల డెవలప్‌మెంట్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ హనుమంతురెడ్డి, మానేరు కొండమ్మ, కల్పన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

యాడికి : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) పిలుపుమేరకు గురువారం మండలంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక హైస్కూల్‌లో రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పనికిమాలిన యాప్‌లు, అశాస్త్రీయమైన అసెస్మెంట్ బుక్లెట్ విధానాల వల్ల బోధన సమయం తగ్గిపోతోందన్నారు. వీటిని దక్షిణమే రద్దు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నబిరసూల్, రాజశేఖర్‌నాయుడు, రవికుమార్, శ్రీదేవి, మంజుల, వాణి, రాజు, సాంబశివారెడ్డి, స్వర్ణ గంగ, వేణుగోపాల్, రామకృష్ణారెడ్డిశాస్త్రి, ఫరీద్, చలపతి, నాగరాజు, ఇంటియాజ్, తదితరులు పాల్గొన్నారు.

మూడు హామీలు నెరవేర్చి 'సూపర్ హిట్టా'..?

అబద్ధాలు చెప్పిన చంద్రబాబు-వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం


మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

సూపర్‌సిక్స్ హామీల్లో కేవలం మూడు మాత్రమే నెరవేర్చి పూర్తిగా అమలు చేశామని 'సూపర్‌సిక్స్ -సూపర్‌హిట్' కార్యక్రమం నిర్వహించుకోవడం హాస్యాస్పదంగా ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే వీటిలో కేవలం పింఛన్, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ మాత్రమే అమలు చేసి సూపర్ సిక్స్ సూపర్ హిట్టు అయిందని ఆర్భాటంగా పెద్ద సభ పెట్టుకోవడం బాధాకరమన్నారు. అంతేగాకుండా పార్టీలపరంగా సభ ఏర్పాటు చేసుకుని గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా కలెక్టర్లు, అధికారులంతా వారంరోజుల నుంచి కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి జన సమీకరణ చేశారన్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఐఎఎస్‌లు 'అయ్యా.. ఎస్'లుగా మారిపోయారని విమర్శించారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ సహా 143 హామీలు ఇచ్చి 15నెలల్లో సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామని సభలో చంద్రబాబు చెప్పుకుని తప్పట్లు కొట్టండి అంటూ అడుక్కోవడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్‌లో ఉన్న 20 లక్షల ఉద్యోగాల కల్పన, రూ.3వేల నిరుద్యోగ భృతి ఎంత మందికి ఇచ్చారు? నిరుద్యోగ భృతి ఎంత మందికి వచ్చిందో చేతులెత్తండి అని చంద్రబాబు సభలో ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా రూ.1500 ఎంతమందికి వచ్చిందో చేతులెత్తండి అని ఎందుకు అడగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ ఎంతమందికి వస్తోందో చేతులెత్తండి అని ఎందుకు అడగలేదు? ప్రశ్నలు సంధించారు. హంద్రీనీవాను 40 టీఎంసీల నుంచి 5 టీఎంసీలకు కుదించి రాయలసీమకు ద్రోహం చేసింది చంద్రబాబు కాదా అన్నారు. మరోవైపు ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని చెప్పిన పవన్‌కళ్యాణ్ ఏనాడూ ప్రశ్నించడం లేదన్నారు. నిన్న సభలో అంతా ముఖ్యమంత్రి మాట్లాడతారు అని చెప్పేందుకు పవన్‌కళ్యాణ్ స్పెషల్ ఫ్లైట్ వేసుకుని అనంతపురం వచ్చారని ఎద్దేవా చేశారు. ఇక రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఏమైందో అందరికీ తెలుసన్నారు. బిజెపి అధ్యక్షుడు మాధవ్ కూడా నిన్న సభలో పొగడడానికే పరిమితమయ్యారన్నారు. మీకు సోదరి, మీ శ్రీమతికి వదిన, ఎన్టీఆర్‌కు కోడలు, జూనియర్ ఎన్టీఆర్ తల్లిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కించపరిస్తే ఒక్కమాట మాట్లాడవా? అని నిలదీశారు. 50ఏళ్లుగా నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ విషయంలో ఒక్క ప్రజాప్రతినిధి కూడా మాట్లాడలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి నాయకులు 'రెడ్‌బుక్' అనే మీ వెర్రివేషాలు మానుకుని అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని సూచించారు.

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు..

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి అనంతపురం

ఎవరికైనా ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని, క్షణికావేశానికి లోనుకాకుండా ఆలోచించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయశ్రీ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ కెవిఎల్ సుబ్రమణ్యం సూచించారు. గురువారం నగరంలోని మెడికల్ కళాశాలలో మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, మానసిక వైద్యశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్య నివారణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, గాలి లేని ప్రదేశం.. సమస్యలు లేని జీవితం ఉండదన్నారు. అయితే ప్రతి సమస్యకూ సమాధానం ఉంటుందన్నారు. అయితే సమస్యను తోటివారితో పంచుకున్నప్పుడు లేదా మనమే ఒకటికి రెండుసార్లు ఆలోచించినప్పుడు సమాధానం దొరుకుతుందన్నారు. ముఖ్యంగా మార్కులు తక్కువ వచ్చాయని, ప్రేమలో మోసపోయామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని ఆత్మహత్య చేసుకోకూడదని, అధిగమించే ప్రయత్నాన్ని ధైర్యంతో ముందడుగు వేయాలని సూచించారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. తర్వాత మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయశ్రీ, కెవిఎల్ సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు షారోన్ సోనియా, డాక్టర్ మధు, డాక్టర్ శంకర్, సైకియాట్రి ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శారద, సైకియాట్రీ వైద్యులు డాక్టర్ రవికుమార్, వరదరాజులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సుమన గోపీచంద్, ఆదిరెడ్డి పరదేశీనాయుడు, సీనియర్ డాక్టర్లు శాంతిరెడ్డి, సరళ, దుర్గ, ఉమామహేశ్వరరావు, ఆశాలత, పూర్ణ చంద్రశేఖర్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం : ప్రపంచ ఆత్మహత్యల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఎస్‌వి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిగమా ఫౌండేషన్, మై భారత్ అనంతపురం, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, కెహెచ్ మైండ్ కేర్ ఆసుపత్రి, ఎస్‌వి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కలశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ప్రిన్సిపాల్ ఎన్.ఆంజనేయ వరప్రసాద్, మానసిక వైద్య నిపుణులు గరుగు బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, కె.జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆనందబాబు, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్‌నాయక్, కృతిక, గోపీ, మల్లీశ్వరి, షర్మిల, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువత పాల్గొన్నారు.

'రణభేరి'ని జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 19వతేదీ వరకు చేపడుతున్న రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్‌వివి రమణయ్య, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, పూర్వపు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని పలు పాఠశాలల్లో పర్యటించి ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ12వ పిఆర్‌సి కమిషనర్‌ను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలు విడుదల చేసి బకాయిలు చెల్లించాలని, సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, పాఠశాలల్లో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని చేపట్టనున్న రణభేరి జాత ఈనెల 16వతేదీన గుంతకల్లులో జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. అక్కడి నుంచి వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్, రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా అనంతపురంలో ముగుస్తుందన్నారు. ఈజాతాలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు మహమ్మద్ గౌస్, ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, నాయకులు హేమ్రి, దేవేంద్రమ్మ, బాబురావు, మారుతీ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


బుక్కరాయసముద్రం మండలంలో ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉరవకొండ : ఆర్థిక, విద్యారంగ సమస్యల సాధన కోసమే యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి జాతా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా నాయకులు రామప్పచౌదరి పిలుపునిచ్చారు. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు దళాలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేసేందుకు నిర్వహించనున్న రణభేరికి సంబంధించిన పోస్టర్లను గురువారం ఉరవకొండ యుటిఎఫ్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు రామప్ప చౌదరి, శేఖర్, రాజశేఖర్, రాజశేఖర్, మండల నాయకులు జయరాములు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, రఘు, శ్రీనివాసగుప్తా, బండయ్య, నాగరాజు, ఇస్లాంబాషా, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలనూ ప్రోత్సహించాలి

జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని సాంకేతిక కళాశాల్లో విద్యార్థులకు విద్యాబోధనతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని జెఎన్‌టియు ఉపకులపతి, స్పోర్ట్స్ కౌన్సిల్ ఛైర్మన్ హెచ్.సుదర్శనరావు సూచించారు. గురువారం స్థానిక జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలోని విసి కాన్ఫరెన్స్ హాలులో స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి టి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో 16వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా 2024-25కు సంబంధించిన క్రీడల వివరాలు, 2025-26కు సంబంధించి వివిధ క్రీడలను నిర్వహించాల్సిన కళాశాలలు, క్రీడల అభివృద్ధికి సంబంధించిన విషయాలను స్పోర్ట్స్ కౌన్సిల్‌కు వివరించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, డిఎపి ఎస్‌వి సత్యనారాయణ, డిఇ వి.నాగప్రసాద్‌నాయుడు, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి సుబ్బారెడ్డి, జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ డి..విష్ణువర్ధన్, ఫిజికల్ డైరెక్టర్ బి.జోజిరెడ్డి, ఎస్కె యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్యులు ఎంవి శ్రీనివాసన్, రాజీవ్‌గాంధీ మెమోరిల్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ, నంద్యాల్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.వెంకటేష్, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సి.సతీష్, స్పోర్ట్స్ సెక్రటరీ టి.నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి హెచ్. సుదర్శనరావు

హోరాహోరీగా ఫెన్సింగ్, గట్కా పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

69వ ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యారణ్య పాఠశాలలో ఉమ్మడి జిల్లాలోని అండర్-14, అండర్ -17, అండర్-19 కేటగిరీల్లో బాలురు, బాలికలకు ఫెన్సింగ్, గట్కా పోటీలు నిర్వహించారు. పోటీలను ఇంటర్మీడియట్ జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి వెంకట రమణనాయక్, అనంతపురం డివిజన్ విద్యాధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇక్కడ మంచి ప్రతిభ ప్రదర్శించిన బాలబాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పాఠశాల క్రీడా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీ శ్రీవాస్‌రెడ్డి, ప్రెసిడెంట్ మురళీకృష్ణ, ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి పుష్పావతి, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ లక్ష్మీదేవి, ఎపిఎస్ఎపిఇ రాష్ట్ర అధ్యక్షులు నరసింహారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్‌రెడ్డి, ఓబులేసు, సమీర, రేఖ, లీలారాణి, ప్రత్యూష, చంద్రశేఖర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

తాడిపత్రిలో భారీ వర్షం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ సిబ్బందితో ఉదయమే ఆయా ప్రాంతాలకు చేరుకుని స్వయంగా పరిస్థితులను పరిశీలించారు. సంబంధిత సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు తక్షణ పరిష్కార చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేశారు. వర్షం నీరు నిల్వతో చూడాలని, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత విభాగాలకు సూచించారు. అదనంగా, శానిటరీ స్టాఫ్ నిరంతరం క్షేత్రస్థాయిలో పని చేసి పట్టణంలో పరిశుభ్రతను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


వర్షం నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ శివరామకృష్ణ

సూపర్ హిట్ కాదు.. సూపర్ ఫ్లాప్: ఎమ్మెల్సీ

ఉరవకొండ : ఇటీవల కూటమి నాయకులు అనంతపురంలో నిర్వహించిన ' సూపర్ హిట్' సభ హిట్ కాదని, అట్టర్‌ఫ్లాఫ్ అయిందని ఎమ్మెల్యే వై.శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలమైనా ఇప్పటిదాకా ఇచ్చిన హామీలు, పథకాల అమలు చేయలేదన్నారు. పథకాలు అమలు చేయకపోగా 'సూపర్‌సిక్స్' విజయోత్సవ సభను నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉన్న పింఛన్లను తొలగించారన్నారు. సూపర్ సిక్స్‌లో లేని అన్నా క్యాంటీన్లను ఇప్పుడు కొత్తగా చేర్చడం విడ్డూరంగా ఉందన్నారు. స్త్రీశక్తి పేరిట ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర సరిహద్దుల్లో నివసిస్తున్న మహిళలకు అవకాశం లేకుండా చేశారన్నారు. తల్లికి వందనం పథకం లబ్ధిదారుల ఖాతాలకు ఇప్పటికీ నగదు జమ కాలేదన్నారు. ఆడబిడ్డ నిధి ఎగిరిపోయిందన్నారు. నిరుద్యోగ భృతి కనిపించలేదన్నారు. ఇక మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ, యూరియా కొరతతో రైతులు, విద్యార్థులకు ఆందోళనలకు సిద్ధమయ్యారన్నారు. వీరిని దారి తప్పించేందుకు డైవర్షన్ చేస్తూ సూపర్ హిట్ సభ నిర్వహించారన్నారు.

'సూపర్ హిట్' విజయవంతంపై హర్షం

పుట్లూరు : అనంతపురంలో బుధవారం నిర్వహించిన 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' సభ విజయవంతం కావడంతో భారీగా తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. సభ విజయవంతం కావడానికి అహర్నిశలు కష్టపడ్డ పోలీస్ శాఖ, ప్రభుత్వ అధికారులు, మీడియా మిత్రులు, నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపిడిఒ శకుంతలమ్మ, డిప్యూటీ తహశీల్దార్ శ్వేతతోపాటు ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పనులు, పురోగతిపై వివరించారు. ఈ సమావేశంలో అన్నిశాఖల అధికారులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నేడు గూగూడుకు ఎంపి, ఎమ్మెల్యే

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామానికి ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం రానున్నారు. ఈ సందర్భంగా మినరల్ వాటర్ ప్లాంట్, సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. వారితోపాటు ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు హాజరుకానున్నారు.

రేపు జాతీయ లోక్‌అదాలత్


మాట్లాడుతున్న జడ్జి కాశీవిశ్వనాథ ఆచారి

గుత్తి : లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథ ఆచారి సూచించారు. ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో గురువారం న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్, క్రిమినల్, ఎంవిఓపిలు, ఎన్ఐ యాక్ట్, మెయింటినెన్స్, పిఎల్ సి కేసులను వీలైనంత సంఖ్యలో పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిపి యు.సురేఖ, ఎక్సైజ్ సీఐ కె.ఉమాదేవి, ట్రైనీ ఎస్ఐ సి.గౌతమ్, ఎఎస్ఐ నాగరాజు, ఎజీపీ పి.ఫక్రుబాషా, న్యాయవాదులు టి.ధనుంజయ, ఎ.సూర్యనారాయణ, విసి గంగాధర్‌కుమార్, ఎం.శ్రీధర్, జెడ్ సతీష్, ఆర్‌వి చలపతి, జి.విజయభాస్కర్, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్‌వలి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గుత్తిలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

గుత్తి : భారీ వర్షాల దృష్ట్యా గుత్తి మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ బి.జబ్బార్‌మియా ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కాలువలను కార్మికులచే శుభ్రం చేయించారు. అలాగే వివిధ వార్డుల్లోని మురుగు కాలువలు శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాల వల్ల ప్రజలు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ లైన్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. హెల్ప్ లైన్ నెంబర్ 9100986895 ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శానిటేషన్‌ను పర్యవేక్షిస్తున్న మేయర్ జబ్బార్‌మియా

పేదలకు అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని పెద్దాసుపత్రి, అంబేద్కర్ భవన్ వెనుక ఉన్న గురుసదన్ ఆశ్రమంలో నిత్యసురభి ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు ధర్మవరం శ్రీనివాసరెడ్డి, ప్రభావతి దంపతుల కుమారుడు సాయి శృతిక్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యం, జగన్నాథ్, సదాశివ, సుభద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


సుదర్శన్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

పుట్లూరు : కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ గరికపాటి సుదర్శన్ నాయుడుని మండలంలోని కొండగారికుంట గ్రామానికి చెందిన నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కోశారు. గరికపాటి సుదర్శన్‌నాయుడు సేవాస్ఫూర్తిని అందరూ ప్రశంసిస్తూ భవిష్యత్తులో ప్రజలకు మరింత మంచి సేవలు అందించాలనే ఆకాంక్షించారు.

వివాహిత ఆత్మహత్య

రాయదుర్గం రూరల్ : మండలంలోని పల్లెపల్లి గ్రామానికి చెందిన చాముండి(21) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. పల్లెపల్లికి చెందిన చిరంజీవికి కర్నాటకలోని కురుగోడు గ్రామానికి చెందిన చాముండితో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన చాముండి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. భర్త చిరంజీవి వేధింపులకు గురి చేయడంతో పాటు తన కుమార్తెను చంపేశారని చాముండి తల్లి నాగమ్మ ఆరోపించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.